

జనసేన ఫిర్యాదు.. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసు నమోదు


# అఖండ భూమి

AKANDA BHOOMI TELUGU DAILY

ఎడిటర్ : యం. ఈశ్వరయ్య — సంచలన దినపత్రిక




యురేనియం నిల్వలను తరలించే ప్రసక్తే లేదు


పచురణ: కర్నూలు,ఆంధ్రప్రదేశ్ సంపుటి : 04 సంచిక : 85 ఎడిటర్ : ఎం ఈశ్వరయ్య పేజిలు : 08, శుక్రవారం 22-05-2026 సెల్ : 9440912389, 9490315559 వెల రూ. 2 రూ/

Published From kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kurnool,


## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..



- ఝార్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు
- లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత
- అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ

ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు,

- మిగతా 2 లో

## అసోం అసెంబ్లీలో ఆసక్తికర ఘటన.. మమతా బెనర్జీకి అనుకూలంగా నినాదాలు



ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకార సమయంలో "మమతా దీదీ జిందాబాద్" అంటూ నినాదాలు


మండియా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అష్మద్

ఎన్నికలకు కొన్నిరోజుల ముందు టీఎంసీలో చేరిక

అసోం శాసనసభ తొలిరోజు కొత్తగా ఎన్నికైన 126 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారానికి సిద్ధమైన సమయంలో నాటకీయ పరిమాణం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరర "మమతా దీదీ జిందాబాద్" అని నినాదాలు చేయడం కలకలం రేపింది. ప్రొటెం స్పీకర్ చంద్ర మోహన్ పటోవరీ, అసెంబ్లీ సెక్రటేరియట్ అధికారుల పర్య వేక్షణలో 126 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీ కారం చేశారు. అయి తే టీఎంసీ నుండి ఎన్నికైన ఏకైక

- మిగతా 2 లో

## 48.1 డిగ్రీలు... పిడుగురాళ్లలో రాళ్లు పగిలే ఎండ!



- నిప్పుల కొలిమిలా ఏపీ
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా నమోదు
- వచ్చే సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరిక

## అమెరికాలో వృద్ధులే టార్గెట్... భారత కాల్ సెంటర్ మూసివేత

- వందలాది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్ది డాలర్ల దోపిడీ
- మియామీకి చెందిన టెలి కమ్యూనికేషన్స్ ద్వారా మోసం
- ఆరేళ్ళ క్రితం దర్యాప్తు ప్రారంభం.. బయటకొచ్చిన భారతీయుల పేర్లు



అమెరికా, విదేశాల్లోని వృద్ధుల నుంచి లక్షలాది డాలర్లను దోచుకుంటున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక కాల్ సెంటర్ నెట్ వర్క్ ను అమెరికా అధికారులు మూసివేయించారు. వందలాదిమంది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్లను

- మిగతా 2 లో

## కనీస వేతనాలు భారీగా పెంచుతూ

# ప్రభుత్వం నిర్ణయం

- తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం
- కార్మికుల కనీస వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించిన ప్రభుత్వం
- జోన్-1-కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాల్టీలు , జోన్-3 గ్రామీణం



రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ ?న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు.

- మిగతా 2 లో

## కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం



2 లో

- పోటెత్తిన భక్తులు
- తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- 12 రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలు
- గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది
- భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

## రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..




- పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ రేవంత్ కు కేటీఆర్ లేఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్
- 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన
- గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు
- రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య

తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

- మిగతా 2 లో

## నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం



- పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు వెంటనే ప్రారంభం కావాలని ఆదేశం
- ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల విలువైన 282 ప్రాజెక్టులకు ఆమోదం
- ఇప్పటికే 114 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వెల్లడించిన అధికారులు
- అనుమతులు, భూ కేటాయింపులు వేగవంతం చేయాలని సీఎం సూచన

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు

- మిగతా 2 లో

## తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్‌కు మంత్రి పదవి ప్రమాణ స్వీకారంలో ఆసక్తికర ఘటన



తమిళనాడు రాజకీయాల్లో ఆరు దశాబ్దాల తర్వాత ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. సుదీర్ఘ విరామం అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయింది. అయితే, ఈ చారిత్రక ఘట్టం ఒక ఆసక్తికర సన్నివేశానికి, చిన్నపాటి వివాదానికి వేదికైంది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే.. - మిగతా 2 లో

## 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే: జగన్



- స్కాముల కోసమే చంద్రబాబు అమరావతి అంటున్నారన్న జగన్
- కేసీఆర్ రూ. 615 కోట్లతో అత్యాధునిక సచివాలయాన్ని కట్టారని ప్రశంస
- 'మావిగన్'కు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారని వ్యాఖ్య


చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైసీపీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఏపీకి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన

- మిగతా 2 లో

# "కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత"

## మహానాడు వేదికగా ప్రతి ఒక్కరికీ చేరాలని దిశానిర్దేశం

- 'కార్యకర్తే అధినేత' స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు నిర్వహించేందుకు పొలిట్ బ్యూరో నిర్ణయం
- మహానాడులో 19 తీర్మానాలు చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయం
- ఏపీ-10, తెలంగాణ-4, అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానంపై చర్చ
- ఉమ్మడి తీర్మానాలు-4, రాజకీయ తీర్మానాలపై చర్చ
- బీసీలు తెలుగుదేశానికి కొండంత అండగా నిలిచారని సీఎం
- పొలిట్ బ్యూరో సమావేశంలో మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం
- "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు



తెలుగుదేశం మహానాడును ఈసారి "స్త్రీ శక్తి" థీమ్‌తో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకుంటూ, పార్టీ వెన్నుదన్నైన బీసీలకు భరోసా ఇచ్చేలా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనేది ప్రతిబింబించేలా శ్రేణులందిరినీ భాగస్వాములను చేస్తూ, సరికొత్త ఉత్సాహంతో ఈ వేడుకను పండుగలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి "స్త్రీ శక్తి" ప్రధాన థీమ్‌గా 2026 మహానాడును నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు మహిళా సంక్షేమం, సాధికారత కోసం దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా టీడీపీ చేపట్టిన విప్లవాత్మక పథకాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ప్రభుత్వ పథకాల రూపకల్పనలో మహిళల భాగ స్వామ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలందరికీ అర్థమయ్యేలా చాటిచెప్పాలని

- మిగతా 2 లో

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు...!





**ప్రతినిధి కురుపాటి గణేష్ నల్లగొండ జిల్లా మే 20 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండలో యాదవ సంఘం భవన్ లో గురువారం నాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది.జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డీసీసీ పున్న కైలాష్ నేత హాజరై ఘనంగా నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీని దేశ ప్రజలు మరువబోరని శాస్త్ర సాంకేతిక రంగాలను దేశానికి అందించిన మహానీయుడు అని కొనియాడారు..పంచాయతీరాజ్ చట్టాన్ని అందించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు లకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్ అందించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కిందని అన్నారు..స్వాతంత్రాన్ని అందించి దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఎలాంటి చరిత్ర లేని బిజెపి నేడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం విడ్డూరం అన్నారు..దేశ ప్రజల హక్కులకై పనిచేస్తున్న దేశ నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ 2029లో ప్రధాని అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ సెల్ చైర్మన్ జిల్లాపల్లి పరమేశ్, ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ బొడ స్వామి, జిల్లా సీనియర్ నేతలు ఎండి ముంతాజ్ అలీ, ఏళ్ల రవీందర్ రెడ్డి, పగిళ్ల రాజు,చర్లపల్లి గౌతమ్, వేముల గోపీనాథ్,చింత ధనుంజయ్, జమ్మూ అశోక్,ఇందనూరి శ్రీను, ఎండి అజీజ్, ఎండి షఫీ,శరత్,గంజి వేణు, కత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు...

## బాలికల భద్రతకు బలోపేతం

**కస్తూర్బా పాఠశాలలో నూతన కాంపౌండ్‌వాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



**నవాపేట్ మే 20 (అఖండ భూమి న్యూస్):** నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినుల భద్రత, పాఠశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నూతనంగా నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్మించిన కాంపౌండ్‌వాల్‌తో విద్యార్థినులకు మరింత రక్షణ కలుగుతుందని, పాఠశాల వాతావరణం మరింత సురక్షితంగా మారుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ నాయకులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సంఖ్య పెంచాలి

**అంచన్పల్లి, మన్సూర్‌పల్లి తండాల్లో పనులను పరిశీలించిన ఎంపీడీవో మంజుల ఏపీవో**





**గండీడ్ .మే 21 . అఖండ భూమి న్యూస్ :**గండీడ్ మండలంలోని అంచన్పల్లి గ్రామం, మన్సూర్‌పల్లి తండాలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఎంపీడీవో మంజుల, ఏపీవో హరిచందర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల నిర్వహణ, కార్మికుల హాజరు, మస్టర్ నమోదు, పనుల పురోగతిపై అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. పనుల వద్ద కార్మికుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని గమనించిన అధికారులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న ప్రతి కుటుంబానికి పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, రోజువారీగా లేబర్ హాజరు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవి కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగకరమని, కూలీలకు నిరంతర ఉపాధి అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పనుల ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామాల్లో ఇంకా ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## ఉగ్రవాద వ్యతిరేక దినంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘన నివాళులు**

**శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి : అర్ధ సుధాకర్ రెడ్డి**





**వికారాబాద్, మే 20 (అఖండ భూమి న్యూస్):** మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి పాల్గొని మహానేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువతకు సాంకేతిక విప్లవాన్ని పరిచయం చేసి దేశ అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేసిన దూరదృష్టి నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం అర్ధ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తున్న నేపథ్యంలో ప్రతి భారతీయుడు హింసకు దూరంగా ఉండి శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. "సమైక్యతే దేశ బలం.. శాంతియుత భారతమే మన లక్ష్యం" అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత ఆశయాలను కొనసాగించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, కౌన్సిలర్లు మున్నూరు శ్రీకాంత్, నాగరాజు, రాకేష్, వినోద్, బి.అశోక్, రామకృష్ణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇమ్మానుయేలు, మిద్దె రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో తెల్లవారుజామున పోలీసుల మెగా కాంబింగ్

**30 బైకులు, 6 ఆటోలు స్వాధీనం.. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా**








**వికారాబాద్ మే 20 (అఖండ భూమి న్యూస్):** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నేరాల నియంత్రణపై మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ ఎన్.ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం తెల్లవారుజామున భారీ స్థాయిలో "కమ్యూనిటీ కాంటాక్ట్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు సాగిన ఈ ఆకస్మిక తనిఖీలతో కాలనీ మొత్తం పోలీస్ వాహనాల సైరన్లతో మార్మోగింది.కాలనీలో ఇంటింటికీ వెళ్లిన పోలీసులు అక్కడ నివసిస్తున్న వారి ఆధార్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృత తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో నివసిస్తున్న ఇద్దరు రౌడీ షీటర్లను, ఇద్దరు అనుమానితులను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల ఫింగర్ ప్రింట్లను మొబైల్ చెక్ డివైస్ ద్వారా సేకరించి ధృవీకరణ చేపట్టడం గమనార్హం. తనిఖీల అనంతరం డీఎస్పీ యాదయ్య కాలనీ వాసులతో సమావేశమై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భద్రత కోసమే ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసులకు ప్రజల సహకారం ఉంటేనే నేరాలను సమూలంగా అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాలనీలోకి కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగినా, గంజాయి విక్రయాలు, బెల్ట్ షాపులు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల భద్రత, సామాజిక బాధ్యతలపై కూడా ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కాంబింగ్ ఆపరేషన్‌లో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేష్, కరణ్‌కోట్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ధరూర్ ఇన్స్పెక్టర్ రఘురాములు సహా 8 మంది ఎస్ఐలు, 54 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ఎస్పీ జానకి కఠిన ఆదేశాలు

**బక్రీద్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా భారీ బందోబస్తు**

**మత్తు పదార్థాలు, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**









**మహబూబ్‌నగర్, మే 21 అఖండ భూమి న్యూస్ :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా పనిచేయాలని జిల్లా పోలీసు అధికారులకు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా పరిధిలో నమోదైన వివిధ కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, మహిళలు మరియు చిన్నారులపై జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయడానికీ వెనుకాడవద్దని సూచించారు. పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రజల్లో భయాందోళనలు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ వారెంట్లు, పీటీ వారెంట్లు, బైండోవర్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా భద్రత అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ఫిర్యాదుదారులకు పోలీస్ స్టేషన్లలో సత్వర సేవలు అందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. మత్తు పదార్థాలు, గంజాయి, అక్రమ రవాణాపై జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండబోదని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా పనిచేయాలని ఎస్పీ జానకి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బాలాజీ, ఇన్స్పెక్టర్లు అప్పయ్య, ఇజాజుద్దీన్, మొతిరాం, నాగార్జున గౌడ్, కృష్ణయ్య, సీఐలు గాంధీనాయక్, రామకృష్ణ, ఐటీ సెల్ ఎస్ఐ రాఘవేంద్రతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘానికి కొత్త సారథ్యం

**నవాబుపేట మండల అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి**

**ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆకాంక్ష**



**మహబూబ్ నగర్ .మే 21 .అఖండ భూమి న్యూస్ ;** నవాబుపేట మండల సర్పంచుల సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంతో మండల రాజకీయ, గ్రామీణ వర్గాల్లో ఉత్సాహ వాతావరణం నెలకొంది. సంఘం అధ్యక్షుడిగా మూడవాత్ సంతోష్ నాయక్ ఎన్నిక కాగా, నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే గ్రామాలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తాయని అన్నారు. నవాబుపేట మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో పయనించేందుకు నూతన కమిటీ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మూడవాత్ సంతోష్ నాయక్ మాట్లాడుతూ... సర్పంచుల హక్కులు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామని అన్నారు. నూతన కమిటీ ఎన్నికల సందర్భంగా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఒకరినొకరు అభినందించుకున్నారు. నూతన కమిటీపై గ్రామ ప్రజల్లో భారీ ఆశలు నెలకొన్నాయి.

నూతన కార్యవర్గ కమిటీ
అధ్యక్షుడు:
మూడవాత్ సంతోష్ నాయక్
ఉపాధ్యక్షులు:
రాములు యాదవ్ (తిమ్మాయిపల్లి సర్పంచ్)
వెంకటేష్ (కామారం సర్పంచ్)
ప్రధాన కార్యదర్శి:
మల్లేష్ గౌడ్ (సిద్ధటం సర్పంచ్)
కోశాధికారి:
శంకరయ్య (కరూర్ సర్పంచ్)
సంయుక్త కార్యదర్శి:
అఖిల (రేకుల చౌడాపూర్ సర్పంచ్)
కార్యదర్శులు:
స్వాతి (బట్టోని పల్లి సర్పంచ్)
నవనీత (చెన్నరెడ్డి పల్లి సర్పంచ్)

నూతన కమిటీ సభ్యులందరికీ పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు అభినందనలు తెలియజేస్తూ... నవాబుపేట మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## రైతు భరోసాకు మరో అడుగు

**నవాబ్‌పేట్ మార్కెట్ యార్డ్‌లో కాంపౌండ్ వాల్‌కు భూమిపూజ..ౖాజూ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**






**నవాబ్‌పేట్, మే 21 అఖండ భూమి న్యూస్ :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో నూతనంగా నిర్మించనున్న కాంపౌండ్ వాల్‌కు గురువారం ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ౖాజూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్లు విక్రయించుకునేలా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో మార్కెట్‌కు మరింత భద్రత, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, ౖాజూ సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డీటీసీలో వసతుల కల్పనకు వేగం

**నూతన బోరు బావి పనులకు శ్రీకారం చుట్టిన ఎస్పీ స్నేహ మెహ్రా**

**శిక్షణ కేంద్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**





**వికారాబాద్. మే 20 (అఖండ భూమి న్యూస్):** వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లా పోలీస్ శాఖ మరింత ప్రాధాన్యత ఇస్తోంది. శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. ఇందులో భాగంగా డీటీసీ ప్రాంగణంలో నూతన బోరు బావి తవ్వక పనులను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శిక్షణ కేంద్రంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శిక్షణ పొందుతున్న సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వసతులు కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరులను పెంచేందుకు ఈ బోరు బావి ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు ఉపయోగపడేలా సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. డీటీసీలో శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్య శిక్షణతోనే నిరుద్యోగానికి చెక్

**పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నాం**

**టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులతో మమేకమైన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**








**మహబూబ్ నగర్ .మే 21 .అఖండ భూమి న్యూస్ :** మహబూబ్‌నగర్ పట్టణ యువతకు ఉపాధి అవకాశాల దిశగా నైపుణ్య శిక్షణే బంగారు బాట అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న ఉద్యోగ, ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు శిక్షణ విధానం, కోర్సుల నాణ్యతపై ట్రైనర్లను అడిగి వివరాలు సేకరించారు. యువతకు డిగ్రీలు మాత్రమే సరిపోవని, కాలానుగుణ నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. గతంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్ కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రస్తుతం టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్వ్యూ టెక్నిక్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు ఫీజుల భారం వల్ల శిక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన సొంత నిధుల ద్వారా సహాయం అందిస్తూ ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌లో విద్యార్థులు చూపుతున్న ఆసక్తి, నేర్చుకునే తపన తనను ఎంతో ఆకట్టుకుందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారానే రాష్ట్ర యువత భవిష్యత్తు బలోపేతం అవుతుందని, నిరుద్యోగ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా టాస్క్ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని కొనియాడుతూ ట్రైనర్లు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎంపీ ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, టాస్క్ ఇంచార్జి హెచ్.సతీష్ కుమార్, ట్రైనర్లు ఎం.సతీష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# చండూరులో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు...!

**భారత సాంకేతిక విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ :**

**కాంగ్రెస్ నాయకుల నివాళి**



**ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు మండలం మే 20 (అఖండ భూమి న్యూస్):** భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు, మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి..చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, చేతులు జోడించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...దేశంలో నేడు మనం అనుభవిస్తున్న సమాచార, సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ గారే పునాది వేశారని కొనియాడారు..18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి, దేశ రాజకీయాల్లో యువశక్తి భాగస్వామ్యానికి ఆయన ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం తన ప్రాణాలనే సైతం పణంగా పెట్టిన అమరవీరుడు రాజీవ్ గాంధీ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు..దేశానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని, ఆయన చూపిన బాటలో నడుస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు..ఈ ఘన నివాళి కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోల్ వెంకట్ రెడ్డి, చండూరు మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ సుజా ఉద్దీన్, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, చండూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు పాల్గొన్నారు..అలాగే మాజీ సర్పంచ్ అబ్బనబోయిన లింగయ్య, మాజీ సర్పంచ్ సాపిడి రాములు, మాజీ ఎంపీటీసీ గంట సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరిగి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసాల జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్టేకోల రామేశ్వర్ రావుతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని నివాళు లర్పించారు...

## రాజీవ్ గాంధీ 35 వర్ధంతి కార్యక్రమం జరిగింది.



**మే 20 (అఖండ భూమి న్యూస్):** ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం కుక్కునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు భారత మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ 35 వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ వర్ధంతి కార్యక్రమం ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రాజనాల రాజా రామ్మోహన్ రావు గారు మరియు పోలవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి విజయభాస్కర్ గారు ఆదేశాల మేరకు కుక్కునూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ గజ్జి రాజులు గారి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ గారి 35వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ వడ్డే రఘు బాబు మాట్లాడుతూ మాజీ భారత ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ గారు దేశ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు ఆయన చేసిన పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా ఉన్నాయని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు అంగోతు శ్రీనివాసరావు జిల్లా ర్ సెల్ అధ్యక్షులు మడకం రాములు మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు వరుస నాగేశ్వరరావు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గాడిద మధుసూదన్ రావు శ్రీనివాసరావు తదితర నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై తనిఖీ నిర్వహించిన జాయింట్ కలెక్టర్



**త్రిపురాంతకం మే 20 (అఖండ భూమి న్యూస్):** త్రిపురాంతకం మండలంలోని స్థానిక ఎరువుల దుకాణాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ వారు మరియు ఇన్చార్జి జిల్లా వ్యవసాయ అధికారి త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం గ్రామంలో గురువారం ఆకస్మికంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. అ ఆ తనిఖీలో బాగంగా ఎరువుల నిల్వలు మరియు అమ్మకాలకు నిర్వహణ సరిపోనందున శ్రీ వెంకట కదంబిని ట్రేడర్ నందు 34250/- రూ, ఎరువులు, శ్రీ వెంకట ధరణి ట్రేడర్ నందు రూ.304943/- ఎరువులు మరియు అనుమతి లేని రూ.17116/- విలువ గల పెసర విత్తనాలను సీజ్ చేసి గౌరవ జాయింట్ కలెక్టర్ కోర్టు లో 6ఏ కేసులు నమోదు చేసి, మరియు రూ.63230/-అనుమతి లేని పురుగుమందులు అమ్మకాలను నిలుపుదల చేసి నారు, ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏ పురుగుమందు డీలర్ అయినా ఎరువులు బ్లాక్ మార్కెట్ చేసిన పక్కదారి పట్టించిన సరైన ధరలకు ఎరువుల విక్రయించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వర్ రెడ్డి, త్రిపురాంతకం తాసిల్దారు విజయ భాస్కర్ మరియు పెద్దారవీడు. మండల వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు పాల్గొన్నారు.

## త్రాగునీటి చేతి పంపుల ఏర్పాటుకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శంకుస్థాపన



**ఏలేశ్వరం,మే 20 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పరిధిలోని పేరవరం,తూర్పు లక్ష్మిపురం గ్రామాలలో మండల పరిషత్ సాధారణ నిధులతో ఏర్పాటు చేయనున్న చేతి పంపులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు,ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తీరేలా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యిజనగిరి శివ ప్రసాద్,కూటమి శ్రేణులు,ఎంపీడీఓ రామరాజు వర్మ,సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాతన గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



**తుగ్గలి, మే 21 (అఖండ భూమి న్యూస్:-)** తుగ్గలి మండలం రాతన గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కేటాయించిన స్థలంలో గురువారం ఉదయం 7:35 గంటలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తమ మద్దతు తెలిపారు. గ్రామాభివృద్ధి, సామాజిక సమానత్వానికి అంబేద్కర్ ఆశయాలు మార్గదర్శకాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమం భక్తి, శ్రద్ధాభక్తులతో సాగింది.

## దోర్నాల ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం





**బిదోర్నాల మే 20 (అఖండ భూమి న్యూస్):** 30 ఏళ్లగా ఇబ్బంది పడుతున్న మూడు రాష్ట్రాల శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి వెళ్ళే భక్తులు మరియు ప్రయాణికులు ఎదుర్కొంటున్న కష్టాలకు నేటితో ముగింపు పలుకుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతులమీదుగా శంకుస్థాపన చేయటం జరిగినది.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ కొరకు కోటి రూపాయలు మంజూరు చేయగా మొదటి విడతగా 40 లక్షలు విడుదల చేసి త్వరతగతిన పూర్తి చేసి దోర్నాల ప్రజలకు అంకితం చేస్తామని తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత , ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి , గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి ఆర్టీసీ ఆర్ఎం మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెద్ద బొడ్డేపల్లి చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం: పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**మే 20 (అఖండ భూమి న్యూస్):** పెద్ద బొడ్డేపల్లి చెరువు సమగ్ర అభివృద్ధిలో భాగంగా పంట కాలువ పూడికతీత, చెరువుగట్టుపై జంగిల్ క్లియరెన్స్, రెండు గేట్ల ఏర్పాటు పనులను రూ. 6.5 లక్షల గ్రాంట్ నిధులతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని జలవనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆర్డీఓ బంగ్లా ముందు కల్వర్టు పనులు అవుతున్నాయని అదేవిధంగా జోగినాథపాలెంలో కల్వర్ట్ పనులను విజయవంతంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. రూ. 1 కోటి 40 లక్షల వ్యయంతో ఇక్కడ అధునాతన వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. గౌరవ స్పీకర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యాటక కేంద్రంగా మార్చడమే తమ ముఖ్య ఉద్దేశమని, అందరి సహకారంతో ఈ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో పెద్ద బొడ్డేపల్లి చెరువు నీటి సంఘం చైర్మన్ రుత్తల రామసత్యం, వైస్ చైర్మన్ గుడివాడ అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ గుడివాడ రాజానాయుడు, సత్తిబాబు, అప్పలనాయుడు, రావణపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కృష్ణ మరియు స్థానిక రైతులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ కోసం పడిగాపులు

**నాతవరం పెట్రోల్ బంకు వద్ద**



**అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మే 21 అఖండ భూమి న్యూస్:** అనకాపల్లి జిల్లా నాతవరం మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీనరసింహ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్ వద్ద గత రెండు రోజులుగా పెట్రోల్ డీజిల్ లేక మండల కేంద్రంలో వాహనదారులు తీవ్ర ఇబ్బంది గురయ్యారు ఎట్టకేలకు గురువారం సాయంత్రం పెట్రోల్ డీజిల్ రావడంతో తొండొపుతుండగా వాహనదారులు చేరుకొని ఊపిరి పీల్చుకున్నారు గత రెండు నెలలుగా వారానికి ఒక్కసారి బంకులో పెట్రోల్ అకస్మాత్తుగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది గురవుతున్నామని వాహనదారులు వాపోయారు

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం 22 న సత్య కన్వెన్షన్ హాల్

**ప్రజా ప్రతినిధులు , పాత్రికేయ మిత్రులు...**

**జిల్లా అధికారులు ఆహ్వానించిన జిల్లా కలెక్టర్ ..**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 (అఖండ భూమి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ సమావేశం 22-05-2026 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పురోగతి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు, శాఖల సిబ్బందినీ ఆహ్వానిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

## మత్తుపై టూ టౌన్ పోలీసుల ఉక్కుపాదం

**"రుద్ర" జాగిలంతో విస్తృత తనిఖీలు.. గుట్కా విక్రయాలపై కఠిన హెచ్చరిక**





**మహబూబ్‌నగర్. మే 21 అఖండ భూమి న్యూస్:** జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం "రుద్ర" సహాయంతో మోటర్ లైన్స్ ప్రాంతంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలతో పాటు పలు ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు 18 ఏళ్ల లోపు పిల్లలకు గుట్కా, టొబాకో ఉత్పత్తులు, సిగరెట్లు విక్రయించవద్దని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా దెబ్బతీసే ప్రమాదకర అలవాటని పేర్కొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ నిరంతర చర్యలు కొనసాగిస్తోందని, అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## డివిజన్ కేంద్రంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి...!



**ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు డివిజన్ మే 20 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు డివిజన్ కేంద్రంలో డిఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉన్నదని తెలంగాణ ఉద్యమకారులు కళ్ళెం సురేందర్ రెడ్డి అన్నారు..చండూరు లో వారు మాట్లాడారు..చండూరు డివిజన్ కేంద్రంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ అవుతాయి అని అన్నారు..క్షేత్రస్థాయిలో సమస్యలు, నేరాలు జరిగినప్పుడు ఉన్నత స్థాయి పోలీసు అధికారి నేరుగా పర్యవేక్షించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉంటుందని, ప్రజలు తమ ఫిర్యాదులు లేదా సమస్యలను చెప్పుకోవడానికి జిల్లా కేంద్రానికి వెళ్లకుండా, స్థానిక డివిజన్ కేంద్రంలోనే డీఎస్పీని సంప్రదించే అవకాశం లభిస్తుందని అన్నారు. సిబ్బంది నియామకం, బందోబస్తు నిర్వహణ, మరియు శాంతి భద్రతల విభాగం పరిపాలన సులువుగా సాగుతుందని, డివిజన్ పరిధిలోని జనాభా ప్రాతిపదికన డివిజన్ కేంద్రంలో డి.ఎస్.పి కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు...

## దోమకొండ లో ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి...



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 20 (అఖండ భూమి న్యూస్):** దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఇంద్ర గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆశ బోయిన శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దేశ ప్రధానిగా మొట్టమొదటి ప్రధానమంత్రి ఇంద్ర గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఆమె అందరికీ ఆదర్శనీయంగా నిలిచి భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దోమకొండ సర్పంచ్ ఐరేని నర్సయ్య, మాజీ జెడ్పిటిసి సభ్యులు తీగల తిరుమల గౌడ్, చంద్రయ్య గారి అనంతరెడ్డి, అండెం శంకర్ రెడ్డి, కదిరే గోపాల్ రెడ్డి, మధు, నల్లపు శ్రీనివాస్, నర్సారెడ్డి, అబ్రబోయిన రాజేందర్ , అబ్రబోయిన రాజు,షమ్మీ, సంతోష్, నేతుల మల్లేష్ యాదవ్,, కిష్టారెడ్డి, కలీం, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగుల పెన్షన్లు బోగస్ మెడికల్ సర్టీ ఫిసెట్ ద్వారా తీసుకుంటున్న పెన్షన్లు రద్దుచేయాలనీ కమిషనర్కు వినతి



**బెల్లంపల్లి మే 22(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ లో దాదాపుగ 800 మంది వికలాంగుల పెన్షన్ పొందడం జరుగుతుంది. ఇందులో ఎలాంటి వికలాంగత్వము లేకున్న సుమారుగా 4016 రూపాయలు పొందడం ద్వారా అసలైన వికలాంగులకి పెన్షన్ రాక పోవటంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా డీఆర్డీఏ అదికారిని కలసి బెల్లంపల్లిలోని వికలాంగుల ఆసరా పెన్షన్లలో అనర్హులపై మంచిర్యాల ప్రభుత్వ అస్పత్రిలో సధరను ద్వారా వికలాంగులకి వైద్య పరీక్షలు నిర్వాహణ చేయాలని విజ్ఞప్తి చేసారు.అలాగే గత పది రోజులుగా ఆసరా పెన్షన్ లో అనర్హులను ఏరివేసిన రేవంత్ ప్రభుత్వంకి కృతజ్ఞతలు చెపుతూ..అనర్హులు తీసుకున్న పెన్షన్ లు ప్రభుత్వం రీకవరీ చేయాలని ఆసరా పెన్షన్ లో అనర్హుల పేరు నమోదు చేసిన మున్సిపల్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని కోరారు.ముఖ్యంగా బెల్లంపల్లిలో ఆసరా పెన్షన్ ల లబ్ధిదారుల పేరు మున్సిపల్ కార్యాలయంలో నోటిసు బోర్డుపైన ఉండేలా చేయాలని అయన విజ్ఞప్తి చెసారు.డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరులో 5% వికలాంగులకి అలాట్ మెంట్ పై డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అనర్హులపైన రాజకీయ ప్రాబల్యం లేకుండా విచారణ జరపాలని కోరారు.కొందరు ఇకు ఉండి తమ దగ్గర వారి పేరు రాసి ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం సి ఐ డి దర్యాప్తు జరపాలని,వికలాంగుల పెన్షన్ ఆసరా పెన్షన్లు అనర్హులు పొందరని వారి వద్ద నుండి రీకివరీ చేయాలని గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్ కు వినతిపత్రం అందజేసిన బెల్లంపల్లి కాంగ్రెస్(ఐ)పార్టీ సీనియర్ బిసి నాయకులు శ్రీనివాస్ కొలిపాక తెలిపారు...

## స్పోర్ట్స్ డేలో స్వర్ణం సాధించిన జనగామ రోహిన్ రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 20 (అఖండ భూమి న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- యువజన వారోత్సవాలు"లో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలో స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి (డీవైఎస్‌వో) రంగ వెంకటేశ్వర్ గౌడ్ హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అలాగే జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు యోగా రాంరెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. జనగామ రోహిత్ రెడ్డి స్వర్ణ పతకం సాధించి ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. విజేతలకు పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పతక విజేతలందరికీ అభినందనలు తెలిపారు.

## జగన్ నిరాధార ఆరోపణలు... ఎందుకూ పనికిరాని రాజకీయ ప్రకటనలు : ప్రత్తిపాటి

ప్రజల నాడి గ్రహించలేని నాయకుడు రాజకీయాలకు అనర్హుడు అనేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం




**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** అవినీతి, దోపిడీతో పాటు.. అసత్యాలు, అబద్ధాల్లోనూ తనదే పై చేయి అని జగన్ నిరూపిస్తున్నాడు. పార్ట్ టైమ్ రాజకీయాలు.. ఫుల్ టైమ్ ఎంజాయ్ మెంట్ తో అటు బెంగుళూరుకు, ఇటు తాడేపల్లికి తిరగలేక అష్టకష్టాలు పడుతున్న జగన్.. ప్రజలు కష్టాలు పడుతున్నారనడం హాస్యాస్పదంగా ఉంది. ప్రజల నాడి గ్రహించలేని నాయకుడు రాజకీయాలకు అనర్హుడు అనేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేస్తున్న నిరాధార ఆరోపణలు తన రాజకీయ అసమర్థతకు ప్రబల నిదర్శనాలు. 2019 ఎన్నికల్లో జగన్ వాగ్ధానాలు కోటలు దాటితే.... గడప కూడా దాటలేదు. ఐదేళ్లలో ఎప్పుడైనా హామీలు అమలు చేయొచ్చని అధికారాంతం వరకు ప్రజల్ని వంచించిన జగన్.. 20 నెలల్లో 90 శాతం హామీలు అమలు చేసిన చంద్రబాబు సమర్థతను తప్పుపట్టడం సిగ్గుచేటు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. పాలనా వైఫల్యాలపై జగన్ ఎప్పటిలానే పచ్చి అబద్ధాలు చెప్పారు. తన నియంతృత్వ, విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని రాతియుగంలోకి తీసుకెళ్లింది జగన్ కాదా? తన పిచ్చి నిర్ణయాల ప్రయోగశాలగా రాష్ట్రాన్ని, ప్రజల్ని ప్రయోగ వస్తువులుగా మార్చిన అసమర్థ పాలకుడిగా జగన్ శాశ్వతంగా రాష్ట్ర రాజకీయ చరిత్రలో నిలిచిపోతాడు. రివర్స్ పాలన.. ప్రశ్నిస్తే దండనలు.. బటన్ నొక్కుడు, సంక్షేమం ముసుగులో రాష్ట్రంపై అప్పులభారం.. దోపిడీలు, దౌర్జన్యాలే జగన్ ఐదేళ్లపాటు ప్రజలకు అందించిన పాలనా ఫలాలు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. తెచ్చిన పెట్టుబడులు, సంస్థలు.. పరిపాలనా మార్పులు.. అమరావతి, పోలవరం నిర్మాణ పురోగతిని స్వాగతిస్తే ప్రజల్లో చులకన అవుతాన్నదే జగన్ భయం. తండ్రి, బాబాయ్ లపై జగన్ కు ఉన్న ప్రేమ, కుటుంబ మర్యాద, విలువలపై ఆయనకున్న గౌరవం.. ప్రజల కంటే ఆయన తల్లీచెల్లికే బాగా తెలుసు." అని ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

## ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం.ఊరు బడిని కాపాడుకుందాం.బత్తిన రాజశేఖర్



**పత్తికొండ మే21అఖండ భూమి న్యూ స్** :ప్రభుత్వ బడి పిలుస్తుందని కార్యక్ర మంలో భాగంగా విద్యాశాఖ పిలుపు మే రకు ప్రభుత్వ బడిలో విద్యార్థులను చే ర్పిద్దాం.ఊరు బడిని కాపాడుకుందాం అనే నినాదంతో పత్తికొండ మండల పరి ధిలోని నలకదొడ్డి గ్రామంలో ఉపాధ్యా యులు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ పాల్గొని గ్రామంలో పురవీధుల గుండా గురువా రం ప్రచారం చేశారు.ఈ సందర్భంగా బ త్తిన రాజశేఖర్,ఉపాధ్యాయులు మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతను ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేశా రు.ప్రభుత్వ బడులు ఊరికి గర్వకార ణం అని పిల్లలను ఊరి బడిలో చేర్పిం చడం తల్లిదండ్రులు సగర్వంగా భావిం చాలని పేర్కొన్నారు.ప్రపంచం గర్వించ దగా మేధావులంతా ప్రభుత్వ పాఠశా లలోనే చదవారని గుర్తు చేశారు.పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను రక్షించుకోక పోతే భవిష్యత్తు అందాకారంగా మారు తుందని హెచ్చరించారు.బడి వయసు న్న బడి పిల్లలను ప్రభుత్వ బడిలోనే చే ర్పించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్ర మంలో విద్యా కమిటీ చైర్మన్ పూలరంగ డు,లక్ష్మిరెడ్డి,రఘుశేఖర్,కుబేర. గ్రామ పెద్దలు తదితరుల పాల్గొన్నారు

## డాక్టర్ సుధాకర్ బాబు కు ఘన నివాళులు అర్పించిన: టీడీపీ నాయకులు



**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** పట్టణంలోని మాజీ మంత్రి శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో డాక్టర్ సుధాకర్ బాబు వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ సుధాకర్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వైద్యుడిగా ఆయన సమాజానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ సుధాకర్ బాబు పేద ప్రజలకు అండగా నిలుస్తూ, తన వృత్తిని సేవగా భావించి ఎన్నో కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించిన గొప్ప మనసున్న వైద్యుడని కొనియాడారు. ప్రజల కష్టాల్లో ముందుండి సేవలందించిన ఆయనలాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన మరణం వైద్య రంగానికే కాకుండా సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా కరోనా సమయంలో వైద్య సిబ్బందికి మాస్కులు కావాలని అడిగినందుకే దానిని నేరంగా భావించిన అప్పటి వైసీపీ పాలకులు డాక్టర్ సుధాకర్ బాబు ను చిత్రహింసలకు గురిచేశారని మండిపడ్డారు. విశాఖ పట్టణం నడిరోడ్డుపై చేతులను రెక్కలు విరిచినట్టుగా విరిచి అమానుషంగా హింసించి, వారి మరణానికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఘటన పట్ల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతే కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీ రావడానికి కారణమైందని తెలిపారు. ఇప్పటికీ వైసీపీలో ఉన్న ఎస్సీ సోదరులు ఈ విషయాలను గమనించి ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా , పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్ , ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు , నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండా వీరయ్య , పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుల్లి చిన్న బాబు , నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అంబటి సొంబాబు, తోట బ్రహ్మ స్వాములు , క్లస్టర్ ఇంచార్జీలు మస్తాన్ వలి , కో-క్లస్టర్ ఇంచార్జీ నందనం చంద్రశేఖర్ , మాజీ కౌన్సిలర్లు, యూనిట్ ఇంచార్జీ పిల్లి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## పసుమర్రు గ్రామంలో పోలీసుల భారీ కార్డెన్ సెర్చ్: 54 బైక్‌లు, 2 ఆటోలు సీజ్





**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** పల్నాడు జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు నరసరావుపేట డిఎస్పి ఆధ్వర్యంలో పేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పసుమర్రు గ్రామంలో పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. ఈ విస్తృత తనిఖీల్లో ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలతో పాటు 70 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో ఇల్లాఇల్లు జల్లెడ పట్టిన పోలీసులు, ఎలాంటి సరైన పత్రాలు లేని 54 మోటార్ సైకిళ్లను, 2 ఆటోలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు, కొట్లాటలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టామని అధికారులు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు మరియు అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు గాను ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ 'విశ్లేషణల' వెనుక అసలు రంగు బయటపడింది

జనసేనను టార్గెట్ చేస్తే సహించేది లేదు...

జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి ఫైర్.!



**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** ప్రొఫెసర్ నాగేశ్వర్ జనసేన పార్టీపై తరుచూ విమర్శలు చేస్తూ తన ఉనికి కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, మేధావిగా ఆయన పై గౌరవం ఉందని, అదే సయమంలో జనసేనను టార్గెట్ చేసి మాట్లాడితే సహించేది లేదని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోని. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**విశ్లేషణల పేరుతో నిరాధార అరోపణలు..**

ప్రొఫెసర్ నాగేశ్వర్ జనసేన పార్టీపై, అధినేత పవన్ కళ్యాణ్ పై గతం నుంచి విశ్లేషణల పేరుతో వివిధ విమర్శలకు దిగడం పరిపాటిగా మారిందని, జనసేననే టార్గెట్ చేయడం సరికాదని బాలాజి గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ లు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి జగన్‌ను అరెస్ట్ చేయాలని తమపై ఒత్తిడి వస్తోందని చెబితే.. దానికి అమిత్ షా ఇలా రియాక్ట్ అయ్యారంటూ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను పార్టీకి చెందిన మంత్రి, సీనియర్ నేత నాదెండ్ల మనోహర్ కూడా ఖండించారని వెల్లడించారు.

ఎలాంటి ఆధారాలు లేకుండా ఒక వ్యక్తిపై లేదా పార్టీపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే.. క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది జనసైనికులు, వీరమహిళల మనోభావాలు దెబ్బతింటాయన్న కనీస విచక్షణ నాగేశ్వర్‌కు లేదా అని ప్రశ్నించారు.. నాగేశ్వర్ పై గౌరవం ఉందని, కానీ ఆయన కూడా గుర్తింపు కోసమో మరేదో లబ్ధి కోసమో ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తారు అనుకోలేదన్నారు. రాజకీయ విశ్లేషణల పేరుతో వ్యక్తిగత అజెండాలను రుద్దడం సరికాదని, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని పెంటేల బాలాజి హితవు పలికారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తక్షణమే స్పందించి పవన్ కళ్యాణ్‌కు క్షమాపణ చెప్పకపోతే, జనసైనికుల నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఘనంగా కొల్లి నాగేశ్వరావు వర్ధంతి



**పత్తికొండ మే21ఆఖండభూమి న్యూస్:** రైతు బాంధవుడు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు,పేరుగాంచిన కొల్లినాగేశ్వ రరావు6వ.వర్ధంతి గురువారం పత్తికొం డ చదువుల రామయ్య భవన్ నందు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో కొల్లినాగేశ్వరావు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగినది ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి సురేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్ర దేశ్ రైతు సంఘం జిల్లా డి.రాజాసాహెబ్ దళితహక్కుల పోరాట సమితిరాష్ట్ర నా యకులు గురుదాస్.సిపిఐ సీనియర్ నా యకులు భీమలింగప్ప పాల్గొని కొల్లి నా గేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భం గా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా స హాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్ మా ట్లాడుతూ1938లో జన్మించిన కొల్లి నా గేశ్వరరావు అఖిలభారత విద్యార్థిసమా ఖ్య రాష్ట్రకార్యదర్శిగా వివిధ దశలోనూ కమ్యూనిస్టు పార్టీలో చేరి రైతుల సమ స్యల పరిష్కారానికి జీవితాంతం పోరా డిన మహానేత అని కొనియాడారు. ఉ మ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శిగా,రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడిగా,అఖిల భార త కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడిగా రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు.రైతాంగ స మస్యలపై ఎప్పుడూ రాజీ పడకుండా పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నా రు.కల్తీ పత్తి బీటీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్న సమయంలో రై తుల పక్షాన నిలబడి ఉద్యమాలు చేప ట్టారని గుర్తుచేశారు.అలాగే సాగునీరు త్రాగునీటి మంచినీటి ప్రాజెక్టులు,సాధన కోసం నిరంతరం పోరాడిన నాయకుడు కొల్లి నాగేశ్వరరావు అని అన్నారు.జిల్లా స్థాయి నాయకుడిగా ప్రారంభమైన ఆ యన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర, జాతీ య స్థాయికి ఎదిగి రైతాంగానికి గొంతు కగా నిలిచిందన్నారు.రాష్ట్ర జల వనరు ల ప్రాజెక్టుపై అపార అనుభవం కలిగి ప్ర భుత్వానికి సలహాలు సూచనలు ఇచ్చి న వ్యక్తి కొల్లి నాగేశ్వరరావు అని 2004 లో బీటీ విత్తనాలు అంతర్జాతీయంగా 5 00 గ్రాములుఒక ప్యాకెట్ ధరను 2000 రూపాయలు ప్రకారంగా రైతులు కొను గోలు చేయాలని మాన్సంట్రో కంపెనీ ప ట్టు పడితే అందుకు అంతర్జాతీయ కో ర్టు ద్వారా ఒక ప్యాకెట్ ధరను 700 రూ పాయలకే ఇవ్వాలని పోరాటం చేసి సా ధించిన వ్యక్తి కొల్లి నాగేశ్వరావు భారత దేశానికి ఎన్నుముకైనా వ్యవసాయ రం గం నేడు తీవ్ర సంక్షోభంలో కూరుకు పో తోంది ఇప్పటికే రైతులు బ్యాంకులలో ప్ర వేట్ వ్యక్తుల దగ్గర అధిక అప్పులు స మస్యలతో ఉన్న రైతన్నకి మద్దతు ధర లేక అతి తక్కువ ధరలతో మధ్య దళా రులకు అమ్ముకుంటున్న రైతాంగం కేంద్ర ప్రభుత్వం మూలిగే నక్క మీద తాటికా యపడి నట్లు ఎరువులు ధరలు అమాం తంగాపెంచడం రైతులకు తీవ్రసంక్షే మం లోకీ నెట్టబడిందని వారు ఆవేదన చెం దారు ఎం ఎస్పి మద్దతు ధర చట్టబద్ధ త చేయాలని పోరాడుతున్న రైతులని పట్టించుకోని ప్రభుత్వం పెట్టుబడి దారు లకుమాత్రం లాభాలు వచ్చే నిర్ణయాలు మాత్రం ఆగమేఘాల మీద తీసుకుంటు న్న మోడీ ప్రభుత్వం రైతులకు శాపంగా మారారని వారు ఆందోళన చెందారు రై తుల పక్షాన నిరంతరం పోరాటం చేయా లని కొల్లి నాగేశ్వరరావు చూపిన రైతుల పోరాటాన్ని కొనసాగించాలని వారు పి లుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం మండల అధ్యక్షులు సిపిఐ ప్రజాసంఘాల నాయకులు నెట్టిక ల్లు,శ్రీనివాసులు, వెంకట్రాంరెడ్డి, రఘు. గుండు బాషా.శివన్న.రామాంజనేయు లు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా హృదయ సజీవుడు మన రాజీవుడు

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం...



చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):అత్యంత సంక్లిష్ట పరిస్థితులలో దేశ పాలనా పగ్గాలు చేపట్టిన రాజీవ్ గాంధీ రాజనీతిజ్ఞత దార్శనికతలతో అద్భుతమైన ప్రజాపాలన అందించి ఎప్పటికీ సజీవుడిగా ప్రజా హృదయాలలో నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ వేనోళ్ల కొనియాడారు. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ అధ్యక్షతన ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనిల్ కుమార్ రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ నసురుద్దీన్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రెడ్డెం నర్సిరెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ యడ్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగి నరసింహారావు, కాంగ్రెస్ కిసాన్ విభాగం నాయకుడు తనుబొద్ది సాంబశివారెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాధాకృష్ణ మాట్లాడుతూ యంగ్ ఇండియా నినాదాన్ని ఆచరణాత్మకం ఆదర్శ పాలకుడు రాజీవ్ గాంధీ అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా అత్యధిక సంఖ్యలో విద్యావంతులైన యువత ఉన్న దేశం భారతదేశం అని యువత భవిష్యత్తు దేశ భవిష్యత్తుగా భావించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవలసిన బాధ్యత పాలకుని కర్తవ్యం అని గుర్తించారు. ఇటలీ దేశానికి చెందిన శ్యామ్ పెట్రోడా అనే సాంకేతిక రంగ నిపుణుని భారతదేశానికి రప్పించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి బీజం వేయడం ద్వారా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పితామహుడు అయ్యారని అన్నారు.. సంపూర్ణ గ్రామాభివృద్ధి నిజమైన దేశాభివృద్ధి అని జాతిపిత మహాత్మా గాంధీ ఆలోచనలను ఆచరణాత్మకం చేస్తూ జవహర్ రోజ్గార్ యోజన పేరుతో ఢిల్లీ నుంచి నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలలోకి నిధులు పంపించి గ్రామ సీమల అభివృద్ధికి బంగారు బాటలు వేసిన రాజనీతిజ్ఞుడు రాజీవ్ గాంధీ అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనిల్ కుమార్ రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ నసురుద్దీన్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రెడ్డెం నర్సిరెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు ప్రభాకర్ ఎడ్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగి నరసింహారావు నాదెండ్ల మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అల్లం సుబ్బారావు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కారుచోల స్వప్న కుమార్ పట్టణ కాంగ్రెస్ నాయకులు తనుబొద్ది సాంబశివారెడ్డి ఎప్పాల అంజిరెడ్డి దాసరి శ్యాంబాబు పల్లె పోగు రాజు షేక్ మహమ్మద్ రఫీ షేక్ మస్తాన్ షరీఫ్ షేక్ నజ్మా సోఫియాకుంచాల ఆంజనేయులు కే గోపి ప్రత్తిపాటి కోటయ్య షేక్ నాగూర్ షేక్ మహబూబ్ సుభాని చుక్కా ఎలిజబెత్ రాణి సంగం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండవీడు కోట అభివృద్ధికి నూతన రహదారుల ప్రతిపాదన: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

చారిత్రాత్మక కొండవీడు కోటకు నేరుగా జాతీయ రహదారుల నుండి మెరుగైన రోడ్డు సదుపాయం కల్పించాలని కేంద్ర మంత్రికి ఎంపీ వినతి.

ఫిరంగిపురం - గణేశ్వరపాడు (3 కి.మీ), బోయపాలెం - గణేశ్వరపాడు (6 కి.మీ) పరిధిలో రెండు కీలకమైన 4 లేన్ల అనుసంధాన రహదారుల ప్రతిపాదన.

**చిలకలూరిపేట మే 21 (అఖండ భూమి న్యూస్):** పల్నాడు జిల్లాలోని చారిత్రాత్మక కొండవీడు కోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, జాతీయ రహదారుల నుండి కోటకు మెరుగైన కనెక్టివిటీ కల్పించాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు, టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ.. కొండవీడు కోట పర్యాటక అభివృద్ధికి రెండు కీలకమైన 4 లేన్ల అనుసంధాన రహదారులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. కొండవీడు కోటకు వందల ఏళ్ల చరిత్ర ఉందన్నారు. 14వ శతాబ్దంలో రెడ్డి రాజుల కాలంలో నిర్మితమై, విజయనగర సామ్రాజ్య వైభవానికి సాక్ష్యంగా నిలిచిన కొండవీడు కోటను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. ఈ చారిత్రక ప్రాంతానికి మెరుగైన రహదారులు అందుబాటులోకి వస్తే.. పర్యాటకంగానే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

**ఎంపీ ప్రతిపాదించిన 4 లేన్ల రహదారుల వివరాలు..**

ఫిరంగిపురం - గణేశ్వరపాడు: జాతీయ రహదారి 544డి (అనంతపూర్ - గుంటూరు) జంక్షన్ అయిన ఫిరంగిపురం నుండి గణేశ్వరపాడు వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర 4 లేన్ల రహదారి.

బోయపాలెం - గణేశ్వరపాడు: జాతీయ రహదారి 16 (చెన్నై - కోల్‌కతా) జంక్షన్ అయిన బోయపాలెం నుండి గణేశ్వరపాడు వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర 4 లేన్ల రహదారి. మొత్తం 9 కిలోమీటర్ల మేర ఈ రెండు అనుసంధాన రహదారుల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు.



## సాయిట్రస్ట్ఆధ్వర్యంలో నేత్రదానం



**అనంతపురం ( ఎబి నెట్వర్క్ ) మే 20 (అఖండ భూమి న్యూస్):** అనంతపురం కో చెందిన సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీమతి జి ఏ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు వివరాల్లోకెళ్తే కళ్యాణదుర్గం రోడ్ లో మౌర్య నగర్ లో నివాసం ఉంటున్న శ్రీమతి జి ఎ లక్ష్మీదేవి అనారోగ్యంతో మృతి చెందినది. సాయి ట్రస్ట్ సభ్యుడు జీ ప్రవీణ్ కుమార్ ఈ విషయాన్ని అధ్యక్షుడు విజయ సాయికుమార్ కు తెలియజేయగా వారి కుటుంబ సభ్యులు ప్రవీణ్ అతని సతీమణి నాగరత్నమ్మ కుమార్తె ఏ రేవతి గార్ల అంగీకారాన్ని అంగీకార పత్రం లో వారి సంతకాలు తీసుకుని ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ చెందిన ప్రసాద్ ఆమె నేత్రాలను సేకరించి హైదరాబాదులోని ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ కు పంపినారు.లి ఈ సందర్భంగా సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ్ సాయికుమార్ మాట్లాడుతూ మృతురాలి కుమారుడు సాయి ట్రస్ట్ సభ్యుడు ప్రవీణ్ కి పుట్టెడు దుఃఖంలో కూడా ఇతరులకు సహాయ పడాలని వారి యొక్క ఆలోచనకు , సేవాభావంను అభినందనాలు కృతజ్ఞతలు తెలియజేస్తూ మరణ అనంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికీ శాశ్వతంగా కంటి చూపులు ప్రసాదించవచ్చునని అదేవిధంగా రెండు కుటుంబాల్లో ఆనందాన్ని అందించగలమని ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయాలని ఆసక్తి కలిగిన వారు డాక్టర్ విజయ సాయికుమార్ నెంబర్ 8712345520 ఫోన్లో సంప్రదించగలరని తెలిపారు

## మల్లేపల్లిలో రామకుర్తి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు




**గండేపల్లి, మే 20 (అఖండ భూమి న్యూస్):** గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో,రోటేరియన్ రామకుర్తి బ్రహ్మాజీ నేతృత్వంలో ఉచిత రక్తదాన శిబిరం మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సుమారు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి,రామకుర్తి బ్రహ్మాజీ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత కళ్లజోళ్లు అందజేసారు.అలాగే యువత సేవాభావాన్ని చాటుతూ 20 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేశారు.అలాగే కార్యక్రమానికి హాజరైన ప్రజలకు మజ్జిగ,పులిహోర,స్నాక్స్ అందించి ఆతిథ్యాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా రామకుర్తి బ్రహ్మాజీ మాట్లాడుతూ శిబిరానికి సేవలందించిన వైద్యులకు,స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.గ్రామస్థులు,యువత పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# ఆదర్శంగా నిలిచిన చిన్నారి మండపాక రాస్య రత్నశ్రీ రెండవ పుట్టినరోజు వేడుక

### జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు లక్ష రూపాయల విరాళం అందజేత

**కాకినాడ జిల్లా, జగ్గంపేట మే 20 (అఖండ భూమి న్యూస్):** జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు మండపాక వెంకటేశ్వరరావు, శేషారత్నం దంపతుల మనవరాలు, మండపాక అనిల్ కుమార్, వెంకటలక్ష్మి దంపతుల గారాలపట్టి చిరంజీవి రాస్య రత్నశ్రీ రెండవ పుట్టినరోజు వేడుక ఆదర్శవంతంగా జరిగింది. ఆర్భాటాలు, ఆడంబరాలకు దూరంగా, సమాజ సేవే లక్ష్యంగా రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఈ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారి రాస్య రత్నశ్రీ పేరు మీదుగా, ఆమె తాతయ్య మండపాక వెంకటేశ్వరరావు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిరంతరం ముందుండే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.1,00,000/- విరాళాన్ని శ్రీ జ్యోతుల నవీన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మండపాక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "మా మనవరాలి పుట్టినరోజును ఘనంగా చేసే బదులు ఆ మొత్తాన్ని



సమాజ సేవకు వినియోగించాలని నిర్ణయించుకున్నాం. ఎన్నో సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు ఈ సాయం అందించడం సంతోషంగా ఉంది. ఈ చిన్న వయసులోనే మా పాప ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలన్నదే మా ఆకాంక్ష" అని తెలిపారు. జిల్లా అధ్యక్షులు శ్రీ జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ, "రాస్య రత్నశ్రీ పుట్టినరోజు వేడుక నేటి సమాజానికి ఒక ఆదర్శం. ఆర్భాటాల కంటే సేవే మిన్న అని నిరూపించిన మండపాక వెంకటేశ్వరరావు కుటుంబానికి అభినందనలు. ఈ విరాళాన్ని ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం" అని పేర్కొన్నారు. చిన్నారి రాస్య రత్నశ్రీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశీస్సులు అందించారు.

**ముఖ్యాంశాలు:**

- కార్యక్రమం: చి. రాస్య రత్నశ్రీ మొదటి పుట్టినరోజు
- విరాళం: రూ.1,00,000/- జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు
- వేదిక: టీడీపీ కార్యాలయం, రావులమ్మ నగర్, జగ్గంపేట
- ముఖ్య అతిథి: శ్రీ జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు

ఇలాంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తి నింపుతాయి అని రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల వెంకటేశ్వరరావు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, పీలా మహేష్, కమ్మిల వెంకటేశ్వరరావు, మండపాక మణికంఠ శివకుమార్, టిడిపి యువనేత మండపాక శశి కుమార్ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### - లక్ష రూపాయల జరిమానా.

### కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 (అఖండ భూమి న్యూస్):** ఫిర్యాదుదారురాలు తేదీ 05-08-2022 నాడు తన కుమార్తె ఉదయం ఎప్పటిలాగే స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపింది. అయితే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్కూల్‌కు వెళ్లి విచారించగా, ఆమె ఆ రోజు స్కూల్‌కు రాలేదని తెలిసింది. దీంతో బంధువుల ఇళ్లలో, సమీప గ్రామాల్లో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ఆమె ఆచూకీ లభించలేదు. అనంతరం ఫిర్యాదుదారురాలు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**కేసు వివరాల్లోకి వెళితే..,**

మహమ్మద్ అబ్దుల్ రహీం (20), తండ్రి మహమ్మద్ అమీర్ హుస్సేన్, ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు టెంట్ హౌస్‌లో కూడా పనిచేస్తుండేవాడు. టెంట్ హౌస్ సమీపంలోని ఐస్‌క్రీమ్ దుకాణానికి మైనర్ బాలిక తరచూ రావడం గమనించిన నిందితుడు, ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తూ చనువు పెంచుకున్నాడు. తన స్వార్థ ప్రయోజనాల కోసం పదవ తరగతి చదువుతున్న అమాయక బాలికను లక్ష్యంగా చేసుకుని, ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి "నిన్ను పెళ్లి చేసుకుంటాను" అని నమ్మబలికాడు. బాలిక తాను మైనర్‌నని, తన వెంట పడవద్దని పలుమార్లు చెప్పినా వినకుండా, ఆమెను ఎలాగైనా తన వశం చేసుకోవాలని పథకం పన్నాడు. తన మాటలను నమ్మిన బాలిక వయసు రీత్యా ఏమి జరుగుతుందో పూర్తిగా అర్థం చేసుకోలేని పరిస్థితిని ఆసరాగా తీసుకుని, నిందితుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా, ముందస్తు ప్రణాళికతో ఆమెను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని నిర్ణయించుకుని, పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి, భయపెట్టి బలవంతంగా లైంగికంగా వేధించాడు. 05-08-2022 నాడు స్కూల్‌కు వెళ్తున్న సమయంలో మాయమాటలు చెప్పి మైనర్ బాలికను కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకెళ్లాడు. అక్కడ కొంతకాలం వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఆమెపై లైంగిక వేధింపులను కొనసాగించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, చివరకు ఢిల్లీలో మైనర్ బాలికను గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాలిక వాంగ్మూలం ఆధారంగా నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలను విచారించి నిందితుడు మహమ్మద్ అబ్దుల్ రహీం, తండ్రి అమీర్ హుస్సేన్, తాడ్వాయి గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. అనంతరం అన్ని రకాల సాక్ష్యాధారాలు సేకరించి పోక్సో చట్టం మరియు ఎస్సీ/ఎస్టి చట్టం కింద కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలను పరిశీలించిన జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు (రేప్ ఌ పోక్సో కేసుల విచారణ కోర్టు) జిల్లా



న్యాయమూర్తి డా. సిహెచ్. వివిఆర్ వరప్రసాద్ నిందితుడిపై అభియోగాలు రుజువయ్యాయని తేల్చి, అతనికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన అప్పటి డీఎస్పీ ఏ. శ్రీనివాసులు, ప్రస్తుత డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు, పోలీసు తరపున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె. శేషు, సూర్యప్రసాద్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ వై. నరేష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ టి. సాయిబాబులను జిల్లా ఎస్పీ అభినందించారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### ఖరీఫ్‌కు ముందే రైతులకు శాస్త్రీయ సాగుపై దిశానిర్దేశం

### నంచర్ల రైతు వేదికలో విస్తృత అవగాహన కార్యక్రమం

**మహమ్మదాబాద్, మే 20 (అఖండ భూమి న్యూస్):** వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నంచర్ల రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ పరిమల్ కుమార్ రైతులకు పలు కీలక సూచనలు చేశారు. అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాలు, తక్కువ నీటితో అధిక ఫలితాలు ఇచ్చే ఆరుతడి వరి సాగు విధానాలు, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారంపై పడే ప్రభావాన్ని తెలియజేస్తూ, సమగ్ర ఎరువుల నిర్వహణ ద్వారా ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా యూరియా వాడకాన్ని నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించడం రైతులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగునీటి వినియోగంలో



మితవాదం పాటించాలని సూచించారు. సహజ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, నేల ఆరోగ్యం కాపాడుకోవడం వంటి అంశాలపై కూడా రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. వరి గడ్డిని కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి భూమి సారం తగ్గిపోతుందని హెచ్చరించారు. లోతైన దుక్కి చేయడం ద్వారా భూమి గాలి పీల్చుకొని పంటలకు మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాయత్రి దేవి, మండల అధ్యక్షుడు నారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, భిక్షపతి, తిరుమల్ రెడ్డి, హనుమంతు, బాల్ రెడ్డి, పాండయ్య, మండల వ్యవసాయ అధికారి నరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనికతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

**సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ**

ఇదిలా ఉండగా మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని ఆగ్రో






రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో వచ్చి విత్తనాలను పొందాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్‌లాల్, డిప్యూటీ సర్పంచ్ పవన్, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ, మోహన్, వేణు, శాంతి, అనంతయ్య, వెంకట రాములు, ముకుందం, అశోక్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రజా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డ్ తొలి సమావేశం: భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

### శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సేవలో నాణ్యత, పవిత్రతకు పెద్దపీట -- ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి

**కాకినాడ జిల్లా జగ్గంపేట అన్నవరం మే 20 (అఖండ భూమి న్యూస్):** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం, అన్నవరం నూతన పాలకమండలి తొలి బోర్డు సమావేశం మే 21న విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి దేవస్థానంలోని పలు విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు మెరుగైన సేవలు అందించే దిశగా కీలక సూచనలు చేశారు.

క్షేత్రస్థాయి లో పరిశీలించి నాగేంద్ర చౌదరి -- ఇచ్చిన సూచనలు:

ప్రసాద విక్రయశాల: కొండ దిగువన ఉన్న స్వామివారి ప్రసాద విక్రయ కేంద్రాన్ని సందర్శించి, ప్రసాద విక్రయ తీరు, స్టాక్ నిర్వహణ, పరిసరాల శుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు అత్యంత పవిత్రమైన ప్రసాదాన్ని మరింత హై క్వాలిటీతో అందించాలని, ప్రసాద తయారీ కేంద్రంలో సిబ్బందిని పెంచి పవిత్రతకు భంగం కలగకుండా చూడాలని ఆదేశించారు.

గోశాల నిర్వహణ: స్వామివారి గోశాలను సందర్శించి, గోవుల సంరక్షణ తీరుపై సిబ్బందితో చర్చించారు. గోవులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, పౌష్టికాహారం అందించి గోశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు.

అన్నదానం: అన్నదాన కేంద్రాన్ని సందర్శించి, వంట సిబ్బందితో



మాట్లాడారు. ఎంతమంది భక్తులు వచ్చినా రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

బోర్డు సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు:

1. దళారీ వ్యవస్థ నిర్మూలన: అమాయక భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి దర్శనానికి తీసుకెళ్లే దళారీ వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

2. మౌలిక సదుపాయాల పెంపు:

- దర్శనానికి వచ్చే భక్తులకు త్రాగునీటి కేంద్రాలను పెంచాలి.
- రద్దీ సమయంలో టాయిలెట్ల కొరత తీర్చేందుకు అదనపు టాయిలెట్లు నిర్మించాలి.
- వచ్చే ఏడాది జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని



ముందస్తు ఏర్పాట్లు చేయాలి.

3. సామాన్య భక్తులకు ప్రాధాన్యత: సామాన్య భక్తులు ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండకుండా, స్వామివారిని సులువుగా దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

సభ్యుల వ్యాఖ్య: "అన్నవరం క్షేత్రం కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రం. నూతన పాలకమండలి ఆధ్వర్యంలో స్వామివారి సేవల్లో నాణ్యత, పవిత్రత, భక్తుల సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి భక్తుడు సంతృప్తితో, భక్తిభావంతో తిరిగి వెళ్లేలా కృషి చేస్తాం"వచ్చే పుష్కరాలనకి కొత్తగా నిర్మిస్తున్న అన్నదాన కేంద్రం పూర్తిస్థాయిలో సరికొత్త టెక్నాలజీతో పూర్తి చేస్తాం అని పాలచర్ల నాగేంద్ర చౌదరి తెలియజేశారు.

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

### - కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 20 (అఖండ భూమి న్యూస్):** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోనీ దోమకొండ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖాన ఆవరణలో నిర్వహించిన హెచ్ డి సి ( హాస్పిటల్ డెవలపెంట్ కమిటీ) సమావేశంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మరియు ఆసుపత్రి అధికారులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు అని, పేద వారు మాత్రమే ప్రభుత్వ దవాఖాన కి వస్తారు కాబట్టి వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అత్యవసరం అయితే తప్ప రోగులు జిల్లా కేంద్రానికి పోకుండా సేవలు అందించాలి అని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ప్రస్తుతం ఉన్న సమస్యలు పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

## గోరక్షకులకు బెయిల్ మంజూరు చేసిన రంగారెడ్డి జిల్లా కోర్టు




**ఎల్బీనగర్ మే 21. ప్రతినిధి కళ్లెం బాలకృష్ణ మే 20 (అఖండ భూమి న్యూస్):** గురువారం మే 21, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోరక్షకులపై నమోదైన అక్రమ కేసులో , బాదితులకు అండగ నిలిచి , విశ్వహిందూ పరిషత్ ,విధి ప్రకోష్ఠ (లీగల్ సెల్) ముందుండి నిలిచి , వారికి బెయిల్ ఇప్పించిన విధి ప్రకోష్ఠ ప్రాంత ,కో కన్వీనర్ ,వనం శ్రీకాంత్, జిల్లా కన్వీనర్ వట్టికూటి అంజయ్య గౌడ్, మరియు వివేక్ గౌడ్ ,సురేష్ , బాల్ రెడ్డి, తదితర న్యాయవాదులు, మరియు విశ్వహిందూ పరిషత్ జిల్లా , కార్యదర్శి, పులి మద్ది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మదాబాద్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**మహమ్మదాబాద్ మే 20 (అఖండ భూమి న్యూస్):** మహమ్మదాబాద్ మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారతదేశానికి ఆధునిక పునాదులు వేసిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ



అని కొనియాడారు. ఐటీ, టెలికాం రంగాలకు నాంది పలికి దేశాన్ని సాంకేతికంగా ముందుకు నడిపించిన మహనీయుడని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని కృషి చేశారని, చివరి క్షణం వరకు దేశ సేవకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప యోధుడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, గ్రామ సర్పంచ్ రామ్‌లాల్, డీసీసీ సభ్యుడు అనంతయ్య, మాజీ ఎంపీపీ శాంతిరంగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు ముకుందం, సర్పంచ్ ఆంజ్యానాయక్, ఉపసర్పంచ్ పవన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, వేణుగౌడ్, నర్సింహులు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇషా బాస్రావి రహీం, వార్డు సభ్యులు శ్రీనివాస్, అశోక్, గోపాల్, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనయ్య గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పిన్నెల్లిలో వరిగడ్డి వాము దగ్ధం లక్ష రూపాయల ఆస్తి నష్టం



**మాచవరం మే 20 (అఖండ భూమి న్యూస్):** మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో భారీ అగ్నిప్రమాదం గురువారం జరిగింది గ్రామంలోని మాడుగుల మోషే కలిశా సంబంధించిన మూడు ఎకరాల గడ్డి అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. సుమారు దీని విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి పూతరేటి దూరంలోనే పెట్రోల్ బంక్ మసీద్ ఉన్నాయన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళుతున్న సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ వెంటనే పిడుగురాళ్ల అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గ్రామంలో పెద్ద ప్రమాదమే తప్పిందని గ్రామస్తులన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన వరిగడ్డి వాము పక్కనే వేరే వాళ్ళ గడ్డివాములు కూడా ఉన్నాయని ఆ పక్కన సెల్ టవర్ కూడా ఉందని ఊహించుకుంటూనే ప్రమాదం ఏ రీతిలో ఉంటుందో అర్థమవుతుంది అన్నారు అగ్నిమాపక సిబ్బంది నాయక్ ఆధ్వర్యంలో మంటలు అర్పారని వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ తెలిపారు వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ సమయస్ఫూర్తికి గ్రామస్తులు అటు రైతులు అభినందిస్తున్నారు ఏదైనా ప్రమాదం జరిగి వెంటనే సంబంధిత సిబ్బందికి ఫోన్ చేసి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఉంటుందని కృష్ణ అన్నారు

## వామ్మో ఎండలు మాచవరంలో బెంబేలెత్తిన ప్రజలు

### నిర్మానుషంగా మారిన రహదారులు 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**మాచవరం మే 20 (అఖండ భూమి న్యూస్):** మాచవరం మండలం లో ఎండలు మండిపోతున్నాయి ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ మంటలు కురిపిస్తున్నారు గత నాలుగు రోజులుగా ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు. ఒకపక్క ఎండ తీవ్రత మరోపక్క వడగాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో



ప్రజలు బయటికి రావద్దని అత్యవసరమై వచ్చిన తప్పనిసరిగా గొడుగు ఉపయోగించుకోవాలని అలాగే వాటర్ బాటిల్ తమ వెంట తెచ్చుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు మరో నాలుగు రోజులు పాటు ఇలాంటి ఎండలే కొనసాగుతాయని ప్రజలు అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు కూడా సూచిస్తున్నారు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం భారీ స్థాయిలో ఎండలు ఉండడంతో పొరుగు గ్రామాలకు ప్రయాణాలు కొనసాగించాలన్న ఇబ్బందిగా ఉంది అంటున్నారు. బాటసారిలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెలాఖరి కల్లా ఋతుపవనాలు మొదలై కొద్ది గొప్ప వర్షాలు పడితేనే ప్రజలు ఉపశమనాన్ని పొందగలరు

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు



**తుగ్గలి, మే 20 (అఖండ భూమి న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నీ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, టీఎండీ హుస్సేనీలు విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, గ్రామస్థాయి కార్యకలాపాలపై చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్సీపీ సిద్ధాంతాలను బలోపేతం చేయాలని జగన్ నాయకులకు సూచించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల అభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు.



స్టైలిష్ ఫోజులతో ఆకట్టుకుంటున్న నభా నటేష్!

# డెకాయిట్ కోసం భలే ప్లాన్

టాలీవుడ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ కలిసి నటిస్తున్న సినిమా డెకాయిట్. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలున్నాయి. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఉగాది, ఈద్ కానుకగా 2026 మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు ఇప్పటికే మేకర్స్ వెల్లడించారు. డిసెంబర్ 18న డెకాయిట్ ట్రైలర్ వాస్తవానికి ఈ సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా రిలీజవాల్సింది కానీ కొన్ని కారణాల వల్ల సినిమాను వచ్చే ఏడాది మార్చి 19కి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఓ ముఖ్యమైన అప్డేట్ ను సోషల్ మీడియా ద్వారా అందించారు. డెకాయిట్ టీజర్ అప్డేట్ ను వెల్లడిస్తూ మేకర్స్ ఆడియన్స్ కు ఓ గుడ్‌న్యూస్ ను షేర్ చేశారు. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! ముంబైలో గ్రాండ్ ఈవెంట్ డెకాయిట్ టీజర్ ను డిసెంబర్ 18, 202న రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు. అంతేకాదు, ఈ టీజర్ లాంచ్ ఈవెంట్ ను రెండు భాషల్లో, రెండు సిటీల్లో, రెండు టీజర్లను రిలీజ్ చేయనున్నట్టు కూడా తెలిపారు. అందులో భాగంగానే డిసెంబర్ 18వ తేదీ ఉదయం 11 గంటలకు ముంబైలోని గెయిటీ గెలాక్సీలో రిలీజ్ చేయనుండగా, డిసెంబర్ 18 సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్ లోని ఏఏఏ సినిమాస్ లో మీడియాతో మీట్ అండ్ గ్రీట్ తో పాటూ టీజర్ లాంచ్ ఈవెంట్ ను ఏర్పాటు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న సినిమా కావడంతో మేకర్స్ దాన్ని దృష్టిలో పెట్టుకునే టీజర్ లాంచ్ నుంచే ప్రమోషన్స్ ను ప్లాన్ చేశారని, అందులో భాగంగానే టీజర్ ను రెండు ప్రధాన నగరాల్లో చేస్తున్నారని వారి ప్లాన్ ను చూస్తుంటే అర్థమవుతుంది. కాగా ఈ సినిమాను సునీల్ నారంగ్, సుప్రియ యార్లగడ్డ సంయుక్తంగా నిర్మిస్తుండగా ఈ సినిమాలో బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో యాక్షన్, సస్పెన్స్ తో పాటూ స్ట్రాంగ్ ఎమోషన్స్ కూడా ఉంటాయని చిత్ర యూనిట్ చెప్తోంది.




సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత చాలామంది సెలబ్రిటీలు ముఖ్యంగా వర్కౌట్స్ చేస్తూ కూడా ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొంతమంది జిమ్లో వర్కౌట్స్ చేయడమే కాకుండా అక్కడ స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చి అభిమానులను అలరిస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ హీరోయిన్గా పేరు సొంతం చేసుకున్న నభా నటేష్ కూడా జిమ్ నుండీ కొన్ని ఫోటోలను పంచుకుంది. అందులో స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం నభా నటేష్ కి సంబంధించిన ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? 1995 డిసెంబర్ 11న కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా శృంగేరి లో జన్మించిన ఈమె మంగళూరులో ఇన్ఫర్మేషన్ సైన్స్ లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. చదువుకుంటుండగానే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె ఫెమినా మిస్ ఇండియా బెంగళూరు 2013లో టాప్ టెన్ లో ఒకరిగా కనిపించింది. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగు పెట్టిన ఈమె.. తొలిసారి 2015లో శివ రాజ్ కుమార్ తో కలిసి కన్నడ మూవీ వజ్రకాయలో నటించింది. ఈ చిత్రం ద్వారానే సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది నభా నటేష్. ఈ సినిమా సూపర్ హిట్ విజయాన్ని అందుకోవడంతో అమ్మడికి మంచి గుర్తింపు లభించింది. లైంగిక దాడి కేసులో నటికి ఊరట.. బాధితురాలికి అండగా నిందితుడి భార్య 2018లో తెలుగులో తొలిసారి నన్ను దోచుకుందువటే అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. అదుగో, ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్ వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇకపోతే గత కొంతకాలం క్రితం యాక్సిడెంట్ బారిన పడ్డ ఈమె దాని నుండి రికవరీ అవ్వడానికి దాదాపు ఏడాదికి పైగానే సమయాన్ని తీసుకుంది. ఇప్పుడు వరుసగా హిస్టారికల్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బిజీగా మారింది నభా నటేష్. ఫుల్ స్వింగ్ లో మల్టీస్టారర్ ట్రెండ్.. లైన్ లో పలు క్రేజీ సినిమాలు ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇటీవల ఈమె పుట్టినరోజు సందర్భంగా ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె పాత్రను రివీల్ చేశారు. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలవల్ల వాయిదా పడుతూ వస్తోంది. హిస్టారికల్ బ్యాక్ గ్రౌండ్ లో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పణలో భువన్ శ్రీకర్ నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. %ూశ్రీంశీ =ఋం% - వారణాసి.. విక్రమార్కుడు తర్వాత ఇప్పుడేనా.. ఈ చిత్రంతోపాటు విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న నాగబంధం అనే చిత్రంలో కూడా హీరోయిన్గా నటిస్తోంది. ఒకవైపు గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా మరొకవైపు ఇలా హిస్టారికల్ పాత్రలలో కూడా నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. దీనికి తోడు ఒక వైపు సినిమాలలో బిజీగా ఉంటూనే మరొకవైపు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు డిఫరెంట్ ఫోటోషూట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది నభా నటేష్.

# దేఖ్ లేంగే సాలా కు ఆ డైరెక్టర్ ఫిదా

**దేఖ్ లేంగే సాలా అంటూ సాగే ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ తో పాటూ సాధారణ ప్రేక్షకుల్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది.**





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఉస్తాద్ భగత్‌సింగ్. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే రీసెంట్ గా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేశారు. దేఖ్‌లేంగే సాలాకు మంచి రెస్పాన్స్ దేఖ్ లేంగే సాలా అంటూ సాగే ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ తో పాటూ సాధారణ ప్రేక్షకుల్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది. పైగా ఈ సాంగ్ లో పవర్ స్టార్ వేసిన స్టెప్పులు ఫ్యాన్స్ ను ఎంతో అలరించడంతో పాటూ ఆ స్టెప్పులు చూసి పవన్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. ఇప్పటికే పవన్, దేవీ శ్రీ ప్రసాద్ కలయికలో పలు సినిమాలు రాగా, అవన్నీ చార్ట్ బస్టర్ ఆల్బమ్స్ అయ్యాయి. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? స్టెప్పులతో ఆకట్టుకున్న పవర్ స్టార్ వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన సాంగ్స్ అన్నీ మ్యూజికల్ హిట్సే. అంతేకాదు, గతంలో హరీష్ శంకర్, పవన్ కళ్యాణ్, దేవీ శ్రీ ప్రసాద్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ సాంగ్స్ బ్లాక్ బస్టర్ హిట్స్ అనే సంగతి కొత్తగా చెప్పనక్కర్లేదు. ఈ సాంగ్ లో పవన్ వేసిన స్టెప్పుల్లో గ్రేస్ బాగా కనిపిస్తోంది. మనకేమైనా సమస్యలొచ్చినప్పుడు స్ఫూర్తినిచ్చేలా ఈ సాంగ్ ఉంటుందని మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ చెప్పగా, ఈ మూవీ నుంచి వచ్చే ప్రతీ కంటెంట్ అద్భుతంగా ఉంటుందని, సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందని నిర్మాత నవీన్ యేర్నేని చెప్పారు. లైంగిక దాడి కేసులో నటికి ఊరట.. బాధితురాలికి అండగా నిందితుడి భార్య ఇదిలా ఉంటే దేఖ్ లేంగే సాలా సాంగ్ కు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఈ సాంగ్ గురించి ఓ స్పెషల్ వీడియో రాబోతున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ వివి వినాయక్ కు ఈ పాట తెగ నచ్చేసిందని, ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియో కూడా రాబోతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే చాలా రోజుల తర్వాత తనకు డ్యాన్స్ వేయాలనిపిస్తుందని పవన్ కళ్యాణ్ గారు ఈ సినిమాలోని సాంగ్ విని తనతో అన్నారని గతంలో దేవీ శ్రీ ప్రసాద్ చెప్పింది బహుశా ఈ పాట గురించేనేమో అని ఇప్పుడంతా అనుకుంటున్నారు.

# వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ!




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఫ్యాన్స్ కు ఒక సాలిడ్ సర్ప్రైజ్ దొరికింది. అనుదీప్ కెవి డైరెక్షన్ లో వస్తున్న 'ఫంకీ' సినిమా రిలీజ్ డేట్ ను మారుస్తూ మేకర్స్ ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ముందుగా ఈ సినిమాను 2026 ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ సినిమా షూటింగ్, అవుట్ పుట్ అనుకున్న దానికంటే బాగా రావడంతో ఫిబ్రవరి 13నే థియేటర్లలోకి తీసుకురావాలని ఫిక్స్ అయ్యారు. ప్రేమికుల రోజు సందర్భంగా వాలెంటైన్స్ వీకెండ్ లో ఈ సినిమా రావడం కచ్చితంగా ప్లస్ అవుతుంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ 'జాతి రత్నాలు' సినిమాతో అందరినీ పొట్టచెక్కలయ్యేలా నవ్వించిన డైరెక్టర్ అనుదీప్, ఇప్పుడు విశ్వక్ సేన్ తో సినిమా చేయడం ఓ వర్గం ఆడియెన్స్ లో ఆసక్తి పెరిగింది. సాధారణంగా విశ్వక్ సినిమాల్లో మాస్, యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ తో వస్తున్నాడు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ఇందులో ఆయన ఒక సినిమా డైరెక్టర్ గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ చూస్తుంటే విశ్వక్ లుక్ చాలా స్టైలిష్ గా, కొత్తగా ఉంది. పసుపు రంగు షర్ట్ వేసుకుని, చేతిలో వాచ్ తో చాలా కూల్ గా కనిపిస్తున్నాడు. ఆ ఆటిట్యూడ్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే క్యారెక్టర్ చాలా ఫన్నీగా డిజైన్ చేసినట్లు అర్థమవుతోంది. వాళ్లకంటే మనవాళ్లే బెటర్! ఇదేం షాక్ భాయ్? ఇక ఈ సినిమాతో టాలీవుడ్ కు కాయదు లోహర్ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. స్క్రీన్ మీద విశ్వక్, కాయదు జోడీ చాలా ఫ్రెష్ గా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ సినిమాకు హైలైట్ అయ్యేలా ఉంది. యూత్ కు కనెక్ట్ అయ్యే లవ్ స్టోరీకి తోడు, అనుదీప్ రాసే పంచ్ డైలాగులు ఈ జంట మధ్య సన్నివేశాలను మరింత ఎంటర్టైనింగ్ గా మారుస్తాయని టాక్. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఆయన ఇచ్చే మాస్ బీట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగ వంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వీరి బ్యానర్ లో వచ్చే సినిమాలకు క్వాలిటీ విషయంలో మంచి పేరుంది. ఈ సినిమా కూడా అదే రేంజ్ లో రిచ్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి ఫిబ్రవరికి సినిమాను ప్రీపోన్ చేయడం అంటే అవుట్ పుట్ మీద మేకర్స్ కు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. సంక్రాంతి హడావుడి తగ్గిన తర్వాత, ఫిబ్రవరిలో వచ్చే క్రేజీ సినిమా ఇదే కావచ్చు. వాలెంటైన్స్ డే మూడ్ లో లవర్స్ కు, ఫ్యామిలీ ఆడియెన్స్ కు ఈ 'ఫంకీ' రైడ్ బాగా కనెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. మరి ఈసారి మాస్ కా దాస్ నవ్వించి ఎలాంటి హిట్టు కొడతాడో చూడాలి.

# బాలయ్య 'అఖండ 2'.. నార్త్ వసూళ్ల సంగతేంటి?




టాలీవుడ్ నటసింహం బాలకృష్ణ.. రీసెంట్ గా అఖండ 2: తాండవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ అఖండకు సీక్వెల్ గా రూపొందిన ఆ సినిమాకు బోయపాటి శ్రీను దర్శకత్వం వహించగా.. డిసెంబర్ 12వ తేదీన వరల్డ్ వైడ్ గా థియేటర్స్ లో గ్రాండ్ గా విడుదలైంది. అయితే అప్పట్లో అఖండ మూవీ తెలుగులో మాత్రమే రిలీజ్ అవ్వగా.. ఇప్పుడు సీక్వెల్ అఖండ 2 తాండవం మాత్రం పాన్ ఇండియా రేంజ్ లో రూపొందింది. అందుకు కారణం.. ఓటీటీలోకి అఖండ అందుబాటులోకి వచ్చాక నార్త్ లో అదిరిపోయే రెస్పాన్స్ రావడమే. అందుకే సీక్వెల్ ను పాన్ ఇండియా రేంజ్ లో రూపొందించారు మేకర్స్. డెకాయిట్ కోసం భలే ప్లాన్ సినిమాలో సనాతన ధర్మం, దేశభక్తికి సంబంధించిన అంశాలను ఉత్తరాది ఆడియన్స్ కోసమే ఎక్కువగా పెంచినట్లు తెలుస్తోంది. శివుని తాండవం, హనుమంతుడి ప్రత్యక్షం, అనేక భక్తి పరమైన సన్నివేశాలు సినిమాకు హిందీలో ఆదరణ పెంచే లక్ష్యంతోనే చేర్చారని తెలుస్తోంది. అంతే కాదు.. ప్రమోషన్స్ కూడా ఫుల్ గా నిర్వహించారు. విడుదలకు కొద్ది రోజుల ముందు బాలయ్య ముంబై వెళ్లి మరీ సందడి చేశారు. కొన్ని హిందీ యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ సమయంలో ఆయన కామెంట్స్.. మీమ్స్ గా మారినప్పటికీ.. డైరెక్టర్ తో కలిసి బాలయ్య కాస్త గట్టిగానే ప్రమోట్ చేశారు. అంతే కాదు.. నార్త్ లో పెద్ద ఎత్తున అఖండ 2 తాండవం మూవీని విడుదల చేశారు. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! అయితే ఇప్పుడు సినిమా హిందీ వెర్షన్ వసూళ్ల వివరాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మొదటి మూడు రోజుల్లో హిందీ వెర్షన్ రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో అది చాలా తక్కువ అనే చెప్పాలి. ఎక్కువ ఊహించామని, నార్త్ లో అఖండ సీక్వెల్ కు తక్కువే వచ్చాయని నెటిజన్లు అంటున్నారు. ఫస్ట్ వీకెండ్ అయిపోయాక కూడా అంత తక్కువ వసూళ్లు వచ్చాయా అని కొందరు షాక్ అవుతున్నారు. అదే సమయంలో ప్రీమియర్స్ తో కలిపి మూవీ రూ.59.5 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ తెలిపారు. బాలకృష్ణ కెరీర్ లోనే మొదటిరోజు ఈ స్థాయిలో వసూలు చేసిన ఫస్ట్ మూవీ ఇదేనని చెప్పారు. ఇప్పుడు మూడు రోజులకు గాను వరల్డ్ వైడ్ గా రూ. 76 కోట్లు వసూల్ అయినట్లు వార్తలు వస్తున్నాయి.

# చీరకట్టులో అనసూయ రాజసం.. గ్లామర్ కవ్వింతలు!



**ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్ళను కట్టిపడేస్తున్నాయి.**

బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చి సక్సెస్ అయిన వారిలో అనసూయ భరద్వాజ్ టాప్ లిస్ట్ లో ఉంటారు. యాంకర్గా తన ప్రయాణం మొదలుపెట్టినా, ఇప్పుడు స్టార్ నటిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు షోలతో బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తన గ్లామర్తో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉండటం ఈ బ్యూటీ స్పెషాలిటీ. తనదైన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులలో చెరగని ముద్ర వేసుకున్నారు. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్స్టాగ్రామ్లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట సెగలు రేపుతున్నాయి. మెటాలిక్ బ్లూ, గోల్డ్ కలర్ కాంబినేషన్ ఉన్న పట్టుచీరలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తున్నారు. దీనికి మ్యాచింగ్గా స్లీవ్లెస్ డిజైనర్ బ్లౌజ్ ధరించి, ట్రెడిషనల్ చీరకట్టులోనూ గ్లామర్ డోస్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఆమె లుక్ చూస్తుంటే క్లాసీగా ఉంటూనే ఎంతో గ్లామర్ గా, స్టైలిష్గా అనిపిస్తోంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్ళను కట్టిపడేస్తున్నాయి. భారీ ఆభరణాల జోలికి వెళ్లకుండా, కేవలం పెద్ద డిజైనర్ చెవిపోగులు, చేతికి నల్లటి గాజులు ధరించి సింపుల్గా మెరిసిపోయారు. హిందీ పాట లిరిక్స్ను క్యాప్షన్గా పెడుతూ, తనలోని లవ్లీ యాంగిల్ను బయటపెట్టారు.



కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనకు తానే సాటి అని అనసూయ ఎప్పుడో నిరూపించుకున్నారు. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా, 'పుష్ప'లో దాక్షాయణిగా ఆమె చేసిన పాత్రలు అంత సులభంగా మర్చిపోలేం. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా ఎంచుకుంటూ నటిగా తన పరిధిని రోజురోజుకూ పెంచుకుంటున్నారు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. సినిమా షూటింగ్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అనసూయ ఎప్పుడూ యాక్టివ్గా ఉంటారు. అప్పుడప్పుడు వెస్ట్రన్ వేర్లో షాక్ ఇస్తూనే, ఇలాంటి చీరకట్టులో అచ్చమైన తెలుగుదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ను సర్ప్రైజ్ చేస్తుంటారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. వయసు పెరుగుతున్నా ఆమెలోని గ్లామర్, ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదని పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.

# వారణాసి.. విక్రమార్కుడు తర్వాత ఇప్పుడేనా..

**ఇక్కడ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విషయం ఒకటుంది. ప్రకాష్ రాజ్ లాంటి గొప్ప నటుడు తెలుగులో దాదాపు అందరు అగ్ర దర్శకులతో పనిచేశారు.**

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న 'వారణాసి' సినిమా మీద రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో కాస్టింగ్ విషయంలో జక్కన్న చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లేటెస్ట్ గా ఈ సినిమా సెట్ లోకి విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ అడుగుపెట్టారనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తి రేపుతోంది. ఇందులో ఆయన మహేష్ బాబుకు తండ్రి పాత్రలో కనిపించబోతున్నారట. ఈ పాత్ర సినిమాకు చాలా కీలకం అని తెలుస్తోంది. డెకాయిట్ కోసం భలే ప్లాన్ నిజానికి రాజమౌళి ఈ తండ్రి పాత్ర కోసం మొదట ప్రకాష్ రాజ్ ను అనుకోలేదట. వేరే ఒకరిద్దరు సీనియర్ నటులపై టెస్ట్ షూట్ కూడా నిర్వహించారని టాక్. కానీ వాళ్ళ పర్ఫార్మెన్స్ విషయంలో రాజమౌళికి ఎక్కడో చిన్న అసంతృప్తి ఉండిపోయిందట. తన కథకు, ఆ పాత్రలోని ఎమోషన్ కు ఆ నటులు సరిపోలేదని భావించి, చివరకు ఆ పాత్రను ప్రకాష్ రాజ్ దగ్గరకు తీసుకెళ్లారట. ఆయన సెట్ లోకి రావడంతో ఆ పాత్రకు నిండుతనం వచ్చిందని యూనిట్ వర్గాల మాట. ఇక్కడ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన విషయం ఒకటుంది. ప్రకాష్ రాజ్ లాంటి గొప్ప నటుడు తెలుగులో దాదాపు అందరు అగ్ర దర్శకులతో పనిచేశారు. పూరీ జగన్నాథ్, వినాయక్, త్రివిక్రమ్, కృష్ణవంశీ.. ఇలా ఆ జనరేషన్ దర్శకులందరి సినిమాల్లో ఆయన పాత్రలు హైలైట్ గా నిలిచాయి. కానీ విచిత్రంగా రాజమౌళితో మాత్రం ఆయన ట్రావెల్ చాలా తక్కువ. ఇప్పటివరకు వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చింది ఒక్క 'విక్రమార్కుడు' సినిమా మాత్రమే. వాలెంటైన్స్ డేకి మాస్ కా దాస్ గిఫ్ట్.. ఫంకీ రైడ్ రెడీ! అప్పట్లో వచ్చిన విక్రమార్కుడు సినిమాలో కూడా ప్రకాష్ రాజ్ ది మెయిన్ విలన్ పాత్ర కాదు. ఆయన చేసింది చాలా తక్కువ నిడివి ఉన్న పాత్రే. ఆ తర్వాత రాజమౌళి తీసిన మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి ఏ సినిమాలోనూ ప్రకాష్ రాజ్ కు అవకాశం రాలేదు. ఇన్నాళ్లకు మళ్లీ 'వారణాసి' సినిమాతో ఈ రేర్ కాంబినేషన్ సెట్ అయ్యింది. అందుకే ఈసారి రాజమౌళి ఆయనకు ఎలాంటి పాత్ర ఇచ్చారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. టెస్ట్ షూట్స్ చేసి మరీ, వేరే వాళ్లు సరిపోరని ప్రకాష్ రాజ్ ను తీసుకున్నారంటే.. ఈసారి ఆయన పాత్ర నిడివి, ప్రాధాన్యత కచ్చితంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. విక్రమార్కుడు సినిమాలోలాగా ఏదో వచ్చిపోయే పాత్రలా కాకుండా, కథను మలుపు తిప్పే బలమైన ఎమోషనల్ పాత్ర అయ్యుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజమౌళి సినిమాల్లో తండ్రి పాత్రలకు ఎప్పుడూ ఒక పవర్ ఉంటుంది. మరోవైపు మహేష్ బాబు, ప్రకాష్ రాజ్ కాంబినేషన్ అంటేనే ఆన్ స్క్రీన్ మ్యాజిక్ అని అందరికీ తెలిసిందే. ఒక్కడు, దూకుడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాల్లో వీరిద్దరి నటన అద్భుతంగా పండింది. ఇప్పుడు ఆ సెంటిమెంట్ కు రాజమౌళి టేకింగ్ తోడవుతోంది. దాదాపు దశాబ్దన్నర తర్వాత రాజమౌళి సినిమాలో ప్రకాష్ రాజ్ నటిస్తుండటంతో, ఈసారి ఆయన విశ్వరూపం గ్లోబల్ స్థాయిలో చూడొచ్చని ఫ్యాన్స్ ఫిక్స్ అవుతున్నారు.

Editor, Printed, Published and Owned by"MASAPOGU ESWARAIAH ,"H.No - 77/1361-E-2-2-E, Faruk Nagar, (Srinivasa Nagar), Aditya Nagar, Kallur Estate, Kallur(M), Kurnool Dist-518003, Andhra Pradesh, R N I , APTEL 2 0 2 2 / 8 4 0 4 2"Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A, BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP. E-mail : akhandabhoomitelugudaily@gmail.com, Cell : +91 9440912389, 9490315559